# ప్రేమ స్పర్శ

"నరసింహులు, డాక్టరే, నా స్టూడెంటు. నగరంలో నర్సింగ్ హోం ఉంది. సొంతమే. భార్య కూడా డాక్టరే! మంచి ప్రాక్టీసుంది. నా ఆపరేషన్ సమయంలో తానూ ఉంటే నాకు ధైర్యంగా ఉంటుంది. పిలిపించండి. ఫీజు అడక్కపోవచ్చు. కాదంటే ఫీజు ఇవ్వండి. ఎలాగయినా అతణ్ణి పిలిపించుకోండి" కోదండం తన ఇద్దరు కొడుకులకూ వివరంగా చెప్పాడు.

హైదరాబాదుకు బయలుదేరి వస్తున్నప్పటినుంచి తన విద్యార్థి గూర్చి తండ్రి చెబుతూనే ఉన్నాడు. వాళ్ళు వాకబు చేస్తూనే ఉన్నారు. ఆ పేరున్న డాక్టరు జాడ వాళ్ళకు తెలియలేదు. ఎవరిని అడిగినా తెలియదని అంటున్నారు. వాళ్ళు చేయని ప్రయత్నం లేదు. కానీ డాక్టరును గూర్చి తెలుసుకోలేకపోయారు.

ఆపరేషన్ బెడ్ మీద, థియేటర్‌లో కూడా కొడుకులకు తండ్రి గుర్తు చేశాడు. తండ్రిని సంతోషపెట్టటానికి 'చెప్పామనీ, వస్తున్నాడనీ, ఆపరేషన్‌కు హాజరవుతాడనీ' అబద్ధం చెప్పారు.

కోదండం చెప్పలేని ఆనందంతో ఆపరేషన్ బెడ్ మీద పడుకొన్నాడు.

హైదరాబాద్‌లో అపోలో, కేర్, నిమ్స్ తర్వాత ప్రసిద్ధి పొందిన మెడ్‌వెల్‌లో తండ్రిని చేర్పించారు. అక్కడ గుండె ఆపరేషన్లన్నీ విజయవంతంగా జరుగుతున్నాయి. ట్రీట్‌మెంటు బాగుంటుంది. మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. సిటీలోని ప్రసిద్ధ డాక్టర్ల సలహా సంప్రదింపులు లభ్యమవుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న సుప్రసిద్ధ డాక్టరు స్థాపించిన వైద్య సంస్థ అది. అతడికి గొప్ప సర్జన్‌గా గుర్తింపు ఉంది.

ఆ డాక్టరు కేస్‌షీట్ స్టడీ చేసి, అన్నీ కూలంకషంగా పరిశీలించి, ఆపరేషన్ తానే తన టీంతో చేస్తానంటే కొడుకులిద్దరూ సంతోషించారు.

థియేటర్‌లో ఎనెస్తీషియా ఇచ్చే సమయంలో కూడా కోదండం 'నరసింహులు వచ్చాడా' అని అడిగాడని, 'వచ్చాడని' వాళ్ళు చెప్పారని, విని కొడుకులిద్దరూ కుదుట పడ్డారు. కొడుకుల అబద్ధాన్ని వాళ్ళు కూడా కాపాడారు.

ఆపరేషన్ ఆరంభమయింది.

అనంతపురం ప్రభుత్వ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా కోదండం చేరిన మొదటి

రోజుల్లో యు.కె. నుంచి నరసింహులు వచ్చాడు. ఉరవకొండను ఆ వూరివాళ్లు యు.కె. అంటారు. నరసింహులుది ఉరవకొండ కాదు. పక్క పల్లె. యస్.యస్.సి. పాసయ్యాడు. కాలేజీలో చేరాలి. సలహా కోసం తన దగ్గరకు వచ్చారు, తండ్రీ, కొడుకూ! మార్కులు చూసి బైపిసిలో చేరమని తాను చెబితే ఆ గ్రూపులో చేరాడు. గవర్నమెంటు హాస్టల్లో సీటు వచ్చింది. బాగా చదువుకొంటున్నాడు. పి.యు.సి.లో మంచి మార్కులు వచ్చాయి.

బియస్సీలో చేరతానన్నాడు. మెడిసిన్‌కి అప్లై చేయమని సలహా ఇచ్చాడు కోదండం.

'సీటొస్తుందా సార్?'

'రాకపోతే బియస్సీ ఉండనే ఉందికదా!'

'సీటొస్తే కర్నూలు పోవాలా?'

'కర్నూలు, గుంటూరు, వైజాగ్ ఎక్కడయితే నీకేం?'

'యస్.సి. హాస్టలుంటుందా సార్?'

'లేకపోయినా నీకు స్కాలర్‌షిప్ వస్తుంది'

భయం భయంగా చూశాడు.

మెడిసిన్‌లో చేరే ముందు రోజు నరసింహులు తండ్రి చనిపోయాడు. అతను చదువు మానేస్తానన్నాడు. కోదండం ఓదార్చి సర్దిచెప్పి స్వయంగా వెళ్ళి మెడిసిన్‌లో చేర్పించాడు. వారం రోజులు ఆలస్యంగా.

నరసింహులుకు ర్యాగింగ్ అంటే భయం. ప్రొఫెసర్లంటే భయం. సవర్ణులంటే భయం. పుస్తకాలు లేవని భయం. చదువంటే భయం. మొదటి సంవత్సరం అంతా ఆందోళన. ఎప్పుడు చదువు మాని వస్తాడోనని కోదండం భయపడుతూ ఉండేవాడు. భయపడితే ధైర్యం నూరి పోసేవాడు. ప్రోత్సహించేవాడు. నలుగురితో కలిసే లక్షణం అలవాటు అయ్యేట్టు చూసేవాడు.

చదువులో వెనకబడలేదు. కానీ తనంటే తనకే భయం. తన కులమంటే భయం. కర్నూలు పరిస్థితులు, విద్యార్థుల వ్యవహారాలు, హాస్టలు అవస్థలు, కాలేజీ సమస్యలు అన్నీ రాస్తూ, చెబుతూ ఉండేవాడు నరసింహులు. కోదండం అన్నీ సర్ది చెబుతూ, అతడు చదువు విజయవంతంగా ముగించుకోవటానికి బాగా దోహదం చేసేవాడు. రెండో సంవత్సరం వచ్చేసరికి నరసింహులు కొంత కుదుట పడ్డాడు. క్రమంగా భయాన్ని జయించసాగాడు. అనాటమీ మొదటిసారే పాసయినందుకు సంతోషం పట్టలేక అనంతపురం వచ్చి మరీ ఆ మాట చెప్పి వెళ్ళాడు.

తండ్రిలేని నరసింహులు కోదండం సార్‌ని తండ్రిగా చూసుకోసాగాడు. అప్పటికింకా పెళ్లికాని కోదండం నరసింహుల్ని తమ్ముడుగా భావించేవాడు.

ఎప్పుడు స్వగ్రామం నుంచి కర్నూలు పోతున్నా, వస్తున్నా లెక్చరర్‌ను చూసి పలకరించి పోయేవాడు. క్రమక్రమంగా బెరుకు తగ్గి ధైర్యం పెరిగి సహవిద్యార్థుల్లో కలసిపోయాడు. అప్పటికి కాని కోదండం తృప్తి పడలేదు - నరసింహులు చదువు గూర్చి.

మెడిసిన్ పూర్తయి, సెలవులకు ఇంటికి వెళుతూ కనిపించి, ఎం.డి. చేయాలని వుందని చెప్పాడు నరసింహులు. తండ్రి కంటే, అన్న కంటే అధికంగా సంతోషించాడు కోదండం.

ఒకరోజు దిగాలుగా ఇంటికి వస్తే తను కంగారుపడ్డాడు. విషయం ఏమిటంటే 'సీటు రాలే'దన్నాడు. 'మళ్ళీ ప్రయత్నించు' అంటే సరే నన్నాడు. చాలా రోజులు కనిపించలేదు. చదవాలనే ఉంది కానీ, ఉద్యోగం చేయాలనో, వైద్యం ప్రాక్టీసు చేయాలనో అతననుకోలేదు. ఎం.డి. సీటు రాక పోయేసరికి మనిషి జవజచ్చిపోయాడు.

మరో రోజు మాసిన బట్టలతో, రేగిన జుట్టుతో, పీక్కుపోయిన ముఖంతో పెరిగిన గడ్డంతో వచ్చాడు. 'ఏం' అంటే ఏమీ మాట్లాడలేదు. ఏదో పెద్ద ఆపద కలిగిందనీ, చెప్పలేకపోతున్నాడనీ కోదండం భావించాడు. 'ఎక్కడున్నావ'ంటే 'పల్లెలో' అన్నాడు.

'ఏం చేస్తున్నావంటే'

'ఏం చేయటంలేదన్నాడు'.

'ఏం చేయకుండా ఎలా ఉండగలుగుతున్నావంటే' 'ఉంటున్నా'నన్నాడు.

అదేం దశో, ఆ స్థితి ఎందుకు కలిగిందో కోదండానికి అర్థం కాలేదు. ఇరవయి రెండేళ్ళ వయస్సు కాబట్టి 'ఎవరినైనా ప్రేమించావా?' అంటే లేదన్నాడు.

'ఎవరైనా మోసం చేశారా?' అని గుచ్చిగుచ్చి అడిగితే 'అట్లాంటిదేమీ' లేదన్నాడు.

అతడి నిర్వేదస్థితికి కారణం తెలియక సంబంధాలు చూస్తున్నారా? సంబంధాలు వస్తున్నాయా? పెళ్ళి చేసుకొందామని ఉందా? అయిన బంధుత్వాలు ఉన్నాయా? అని ఏం ప్రశ్నించినా వ్యతిరేకంగానే బదులు చెప్పాడు.

నరసింహులు తల్లి పల్లెలోనే ఉంటుంది. కూలి పనులకు, పొలం పనులకు పోతుంటుంది. ఎండా కాలం ఉరవకొండలో బేల్దారి పనికి వెళుతుంది. పల్లెలో తల్లి పోషణలో బతుకుతున్నాడని తెలిసి కోదండానికి దిగులు కలిగింది.

'ఇప్పుడేమిటి నీ పరిస్థితి' అంటే ఏడ్చి 'ఆకలిగా ఉందని, మూడు రోజులుగా ఏమీ తినలేదని' నోరు తెరిచాడు.

ఇద్దరూ కలిసి భోంచేశారు. కోదండం కొడుకులిద్దరితో నరసింహం పది రోజులు ఆడుకొంటూ వచ్చాడు.

ఒకరోజు కోదండం అతడితో నువ్వు డాక్టరువి. మంచి డాక్టరువి. నీ మెడలో స్టెతస్కోప్ ఉంది. చేతిలో సిరంజి ఉంది. చాలా జబ్బులు ఎలా నయం చేయాలో నీకు తెలుసు.

'ఎం.డి. సీటు రాలేదు!'

'ఈ సంవత్సరం కాకపోతే వచ్చే ఏటికి సీటొస్తుంది. యాడికి బోతుంది - డ్రాక్టరువై ఉండి అమ్మ మీద ఆధారపడటం, ఆకలి అనడం అన్యాయం. ప్రాక్టీసు ప్రారంభించు.'

'మన దగ్గరకెవరొస్తారు?'

'రోగులెవరైనా వస్తారు'

'నాతో ఇంజక్షను ఎవరు చేయించుకొంటారు?'

'జబ్బు చేసిన ఎవరైనా'

'నన్ను అంటరానివాడుగానే చూస్తారు!'

'డాక్టరు అంటరానివాడు కాదు. నీ దగ్గరకు అంటదగని రోగులు రావచ్చు కానీ, నువ్వు డాక్టరువు. అంటదగనివాడు అనరాదు అంటదగని వాడివి కావు.'

'సార్! లోకం మీకు తెలియదు!'

'నాకు లోకం తెలియకపోవచ్చు కానీ రోగులు, జబ్బులు, వైద్యం, వైద్యుడు తెలుసు'

'నాకు తాడూ బొంగరం లేదు'

'అవెంతసేపు'?

కోదండం బస్‌స్టాండ్ దగ్గర ఒక రూం - రోడ్డు మీదే - అద్దెకు తీసుకొన్నాడు. ఒక టేబుల్, కుర్చీ ఇంట్లోంచి తీసుకెళ్ళి అందులో వేయించాడు. ఒక బెంచి కొని గోడవార పెట్టించాడు.

నరసింహులు ఉదయం ఆరు గంటలకు క్లినిక్ చేరేవాడు. దాని పేరు నరసింహ క్లినిక్ రాత్రి పది గంటల దాకా కూర్చునేవాడు.

మొదట్లో పేషంట్స్ రాలేదు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలాగా క్లినిక్‌లో కూర్చునే ఉండేవాడు.

కోదండంతో 'రోగులు రావటం లేదు' అన్నాడు.

'వస్తారు!'

'కునికిపాట్లు పడలేకుండా ఉన్నాను'

'కునికిపాట్లు పడు, పర్వాలేదు.'

'నా దగ్గరకు పేషంట్స్ రారు. అస్పృశ్యుణ్ణి స్పృశింపనిచ్చేంతగా అనంతపురం పెరగలేదు. మీది వృథా శ్రమ సార్!

'నిరాశవద్దు. ప్రమాదం లేని ఇంజక్షన్లు ఇవ్వు. ఇంజక్షన్‌కు ఇంత అని తీసుకో. ఒక సూది పోటుకి నీకు రోజు గడుస్తుంది. ప్రమాదం లేని టాబ్‌లెట్లు రాసివ్వు'.

'మీరాశావాదులు సార్, వాస్తవం మీరు చూడలేకుండా ఉన్నారు. మిమ్మల్ని నిరాశపర్చలేక కూర్చుంటున్నాను. అప్పుడే నా కులం చుట్టు పక్కల అందరికీ తెలిసిపోయింది'.

'తెలియనీ'

'ఎవరూ రారు'

'చూద్దాం!'

ఒకరోజు ఒక కాలేజి స్టూడెంటు రహస్యంగా వచ్చి చేసిన పని, తెచ్చుకొన్న తంటా చెప్పాడు. నరసింహులు ధైర్యం చెప్పి, ఇంజక్షన్ తెచ్చుకోమని కాగితం మీద రాసి ఇచ్చాడు. ఇంజక్షన్ చేశాడు. ఒక ఇంజక్షన్ ఇచ్చానని మూడు రూపాయిలు వచ్చాయని కోదండం ఇంటికి పరుగెత్తుకుపోయి చెప్పాడు.

'నేను చెప్పలేదా! రోగులు వస్తారు'

'కానీ వచ్చినవాడు యస్‌సి స్టూడెంటు!'

'ఎవడైతేనేం? వచ్చినవాడు రోగి, వాడికి కులం మతం ఉండవు. ఉంటాయనుకొంటే వైద్యం సక్రమంగా అందని వీళ్ళకు సేవ అయినా చేయి'.

క్రమంగా ఒకటీ అర నుంచి రోజుకి అయిదు పది దాక రోగుల సంఖ్య పెరగసాగింది. నాలుగు నెలల్లోనే క్లినిక్ రోగులతో కిటకిటలాడసాగింది.

కోదండం ఇచ్చిన టేబుల్ కుర్చీ ఇచ్చేసి, అద్దెగదికి కట్టిన డబ్బు తిరిగి ఇచ్చి ఉండటానికో రూం అద్దెకు తీసుకొన్నాడు నరసింహులు. కోదండం పట్టరాని ఆనందం పొందాడు.

సంవత్సరంలో కాంపౌండరు, సహాయకుడు ఏర్పడ్డారు. క్లినిక్ రద్దీ పెరగింది. డాక్టరు హస్తవాసి మంచిదనుకొంటున్నారు. మనిషి మంచివాడు అనుకోసాగారు జనం.

వంట్లో బాగా లేదని కోదండం కబురు చేస్తే స్కూటరు మీద వచ్చాడు నరసింహులు. జ్వరం చూశాడు. బి.పి. చూశాడు. నాలిక చూశాడు. బ్లడ్ శాంపుల్ తీసుకొన్నాడు. సాయంకాలం వస్తూ మందులు తెచ్చాడు. ఆరితేరిన వైద్యుడి లాగా నరసింహులు ప్రవర్తిస్తుంటే కోదండం ఎంతో తృప్తిపడ్డాడు.

'ఈసారీ ఎం.డి. సీటు రాలేదు' అని డాక్టరు దిగాలు పడితే 'రాకపోయినా ఫరవాలేదు నీకు మంచి ప్రాక్టీసు ఉంది. కానీ' అన్నాడు తాను.

డాక్టరు ఉద్యోగం ప్రకటన వచ్చిందంటే 'ప్రాక్టీసుకంటేఉద్యోగం గొప్పది కాదు' అన్న కోదండం మాటతో ఏకీభవించాడు నరసింహులు.

రెండేళ్ళు కాగానే మకాం హైదరాబాద్‌కు మార్చాడు. మంచిచోటు చూసుకొని ప్రాక్టీసు ప్రారంభించాడు. బాగా జరుగుతోంది. ఎం.డి. కూడా చేశాడు. డియం అయింది. మంచి హృద్రోగ నిపుణుడిగా మారుతూ వచ్చాడు. తనతో పని చేస్తున్న డాక్టర్ని పెళ్ళి చేసుకొన్నాడు.

కోదండం పెళ్ళికి వెళ్ళి వచ్చాడు. నరసింహులు అభివృద్ధి అతడికి ఆనందదాయకంగా ఉంది.

పిల్లలు కలిగారనీ, ముద్దుగా ఉన్నారనీ, ముచ్చట్లు చెబుతున్నారనీ ఉత్తరాలు వ్రాసేవాడు. ఉరవకొండ వస్తూపోతూ పలకరించేవాడు. కారులో వచ్చేవాడు. కబుర్లు చెప్పేవాడు. కన్నతల్లిని హైదరాబాద్ తీసుకొని వెళ్లాడు. రాకపోకలు తగ్గిపోయాయి. ఉత్తర ప్రత్యుత్తరాలు చెదరుమదరుగా అయిపొయాయి.

ఆ మధ్య డిస్పెన్సరీ కట్టించామని, ప్రాక్టీసు బాగా ఉందనీ, రోగులు ఆరోగ్యం పొంది దీవిస్తున్నారని, అంతా మీ దయ అని రాస్తూ వచ్చాడు. కోదండం సంతోషం ఎల్లలు దాటింది.

తను పెంచిన మొక్క చెట్టై, కొమ్మలు రెమ్మలు పెరిగి, నీడనిచ్చి పక్షులకు గూడునిచ్చి, పదిమందికి ఆశ్రయమిచ్చి ఆరోగ్యమిచ్చి కాపాడుతున్నందుకు ఎంతగానో సంతోషించాడు కోదండం.

ఇల్లు మారాడు. ఫోను మారింది. రాకపోకలు లేవు. సంబంధాలు తగ్గాయి. ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. అడ్రసు కూడా లేదు.

హైదరాబాదులోనే నరసింహులు ఉంటాడు. వెతికి పట్టుకోండి అని కొడుకుల్ని పురమాయించాడు కోదండం. వాళ్లింకా తండ్రిని వదిలి వెళ్లలేక తెలుసుకోగలిగే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

కోదండం ఆపరేషన్ పూర్తయి ఐసియు నుంచి రూంకు మారాడు. పూర్తి ఆరోగ్యం చేకూరింది. డిశ్చార్జి చేసేటప్పుడు బిల్లు కట్టటానికి పిల్లలిద్దరూ సిద్ధమవుతుంటే కోదండం సంతృప్తిగా ఉన్నాడు.

ఆపరేషన్ చార్జీలు, మందుల ఖర్చు, రూం రెంటు, కేంటిన్ ఖర్చు మొత్తం కూడి ఆ బిల్లు డాక్టరు సింహ చెల్లించాడని, అడ్వాన్సు కట్టిన డబ్బు తిరిగి ఇచ్చేశారు హాస్పటల్ వాళ్ళు.

'ఎవరీ సింహా?'

'మెడ్‌వెల్ ఎం.డి!'

'ఆపరేషన్ చేసిందెవరు?'

'డాక్టర్ సింహా. మా బాస్!'

'నేను డాక్టర్ని కలిసి కృతజ్ఞత చెప్పుకొంటాను!'

'డాక్టర్ సింహా కృతజ్ఞత చెప్పుకోవటానికి మీ దగ్గరకే వస్తున్నారు!'

భార్యా పిల్లలతో డాక్టరు సింహ వచ్చి కోదండం కాళ్లకు నమస్కరించాడు.

డాక్టర్ నరసింహుల్ని చూసి కౌగిలించుకొని, కోదండం పట్టరాని ఆనందంతో ఏడ్చేశాడు.